భయపెడుతున్న జంక్షన్లు!

టెక్కలి పాత జాతీయ రహదారిలో కొన్ని జంక్షన్లు ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఈ జంక్షన్ల వద్ద వేగ నియంత్రణలు (స్పీడ్ బ్రేకర్లు) లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని చోట్ల జీబ్రా లైన్లు ఉన్నప్పటికీ వాటిపై చాలామందికి అవగాహన లేదు. ప్రధానంగా వాహనచోదకులు మితిమీరిన వేగంతో దూసుకుపోతున్నారు. ముఖ్యంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎంజేపీఏపీ పాఠశాల జంక్షన్ వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. అలాగే పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ఆస్పత్రి, వైఎస్సార్ జంక్షన్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు వేగనియంత్రణలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

– టెక్కలి


స్పీడ్ బ్రేకర్లు లేని పోలీస్ స్టేషన్ జంక్షన్


తరచూ ప్రమాదాలు జరుగుతున్న డిగ్రీ కళాశాల, ఎంజేపీ పాఠశాల జంక్షన్


రద్దీగా ఉండే వైఎస్సార్ జంక్షన్

క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ విజేత బోర్డర్ జట్టు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: మండలంలోని శిలగాం అల్లేరు క్రికెట్ గ్రౌండ్‌లో శావసానపుట్టుగకు చెందిన శ్యామలమ్మ మెమోరియల్ క్రికెట్ టోర్నీలో విజేతగా ఇచ్ఛాపురం(బోర్డర్)జట్టు, రన్నర్‌గా కత్తివరం జట్టు నిలిచింది. ఆదివారం జరిగిన పది ఓవర్ల ఫైనల్ పోరులో తొలుత బ్యాటింగ్ చేసిన బోర్డర్‌జట్టు నిర్ణీత ఓవర్లలో 99 పరుగులు చేసింది. అనంతరం వంద పరుగుల లక్ష్యంతో దిగిన కత్తివరం జట్టు 98 పరుగులకు ఆలౌటై విజయాన్ని అందుకోలేకపోయింది. విజేతలకు ఎమ్మెల్సీ నర్తు రామారావు బహుమతులు అందజేశారు. విన్నర్ జట్టుకు రూ.13 వేలు, షీల్డ్, రన్నర్ జట్టుకు రూ. ఎనిమిది వేలు, షీల్డ్ అందించారు కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కడియాల ప్రకాష్, ఇప్పిలి కృష్ణారావు, బెందాళం శోభన్, నర్తు శివాజీ పాల్గొన్నారు.

ఖరీఫ్ కోసం రైతుల శ్రమదానం


శ్రమదానం చేస్తున్న రైతులు

ఇచ్ఛాపురం రూరల్: కేశుపురం, బూర్జపాడు, డొంకూరు ప్రాంతాల్లోని సుమారు 1200 ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్ పంటను రక్షించుకునే పనిలో పడ్డారు అన్నదాతలు. గత రెండేళ్ల నుంచి సాగునీరు లేకపోవడంతో పంటలు పండలేదు. ఈ ఏడాది అటువంటి పరిస్థితి రానివ్వకుండా ముందస్తు జాగ్రత్తగా కేశుపురం న్యూ గ్రోయిన్‌కు రక్షణ కల్పించారు. ట్రాక్టర్ల ద్వారా మట్టిని తెచ్చి బాహుదానది నీరు వృథాగా పోనివ్వకుండా గ్రోయిన్ రాళ్ల సందుల్లో మట్టిని పూడ్చారు. వర్షాలు కురిస్తే నీరు సముద్రంలో కలిసిపోకుండా పంట పొలాల వైపు సాగునీటిని మళ్లించేందుకు చర్యలు చేపట్టారు. సుమారు 50 వేల రూపాయలు విలువైన పనుల్ని బూర్జపాడు పంచాయతీ రైతులు శ్రమదానం రూపంలో చేశారు.

బాధితునికి ఆర్థిక సాయం


తాతయ్యకు సాయం అందజేస్తున్న దృశ్యం

కవిటి: మండలంలోని శిలగాంలో గ్రామదేవత ఆలయ నిర్మాణ పనుల్లో తీవ్రంగా గాయపడిన వ్యవసాయ కూలీ కాళ్ల తాతయ్యకు జైహింద్ ఫౌండేషన్ సభ్యులు అండగా నిలిచారు. గ్రామంలో అందరూ శ్రమదానం చేయాలన్న ఉద్దేశంతో ఆలయ నిర్మాణ పనుల్లో భాగస్వామి అయిన తాతయ్య కాళ్లపై మార్బుల్‌స్టోన్ పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యానికి రూ.10 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు దాతలసాయాన్ని కోరారు. దీంతో జైహింద్‌ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు పాండవ శేఖర్ తదితరులు తమవంతుగా రూ.16,500 అందజేశారు.

గ్రామదేవతకు చల్లదనం


బాలామణి అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

కవిటి: మండలంలోని బిగొనవపుట్టుగ గ్రామదేవత బాలామణి అమ్మవారి చల్లదనం ఉత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురియాలని, పాడి పంటలతో రైతులు, ఆరోగ్యంతో ప్రజలంతా క్షేమంగా ఉండాలని కాంక్షిస్తూ ఈ చల్లదనం ఉత్సవాన్ని ఏటా ఈ సీజన్‌లో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా అమ్మవారి ప్రతిరూపంగా భావించే గజముద్దను, కాళికావేషధారణలతో గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం పంటపొలాల్లో వెలసిన అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు, మొక్కుబడులు తీర్చారు. పానకం, పండ్లు ప్రసాదాన్ని నివేదించి భక్తులకు అందించారు.

ట్రాఫిక్ సమస్యలేకుండా చూడండి


ఎమ్మెల్యే శిరీషాకు పూలగుచ్ఛం అందజేస్తున్న వెంకటరావు

కాశీబుగ్గ: పలాస, కాశీబుగ్గ జంట పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని ఎమ్మెల్యే గౌతు శిరీషా పోలీసు సిబ్బందికి సూచించారు. ఎమ్మెల్యే శిరీషాను కాశీబుగ్గ పోలీసు స్టేషన్ ఎస్ఐ వెంకటరావు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. పలాస–కాశీబుగ్గ జంట పట్టణాలలో ట్రాఫిక్ సమస్యలపై చర్చించారు. బస్టాండ్ సమీపం, సంతమైదానంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు.

జోరుగా రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనులు


రైల్వేస్టేషన్ ముఖద్వారం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులు


ప్లాట్‌ఫారంపై నిర్మిస్తున్న షెడ్లు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో అమృత్‌భారత్ పథకంలో భాగంగా అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం రూ. 17.98 కోట్ల నిధులను కేంద్రం మంజూరు చేసింది. ఈ నిధులతో అదనంగా మరో రెండు ప్లాట్‌ఫారాలతో పాటు ప్రస్తుతం ఉన్న రెండు ప్లాట్‌ఫారాలపై ప్రయాణికకుల వేచిఉండేందుకు అవసరమైన షెడ్ల నిర్మాణం, స్టేషన్ మాస్టార్ గదిని ఆధునికీకరించే పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ప్రస్తుతం మొదటి, రెండు ప్లాట్ ఫారాలను బాగుచేస్తున్నారు. రైల్వేస్టేషన్ మాస్టార్ రూమ్, టికెట్ బుకింగ్, విశ్రాంతి గదులను పునర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రస్తుతం రైల్వేస్టేషన్ టికెట్ బుకింగ్ కౌంటర్‌ని ఉత్తరం వైపునకు మార్పుచేసి స్టేషన్ ప్రధాన మార్గాన్ని మూసివేశారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు స్టేషన్‌లోనికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా రత్తకన్న రోడ్‌ని ఎల్‌సీగేట్ కారణంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని.. ఆ సమస్యకు పరిష్కారంగా ఎల్‌సీగేట్ వద్ద అండర్‌పాస్ లేదా ఫ్లెట్లైవర్ బ్రిడ్జిని నిర్మాణం చేపట్టాలని రైల్వే అధికారులకు స్థానికులు కోరుతున్నారు.

తెలుగు సాహిత్యాన్ని శాసించిన శ్రీశ్రీ


శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రచయితలు, కళాకారులు

వజ్రపుకొత్తూరు రూరల్: అభ్యుదయ భావాలతో విప్లవ కవిగా తెలుగు సాహిత్యాన్ని శాసించి సమాజాన్ని మేల్కొల్పిన మహాకవి శ్రీశ్రీ జనంగుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వైతాళికుడు అని రచయిత, ప్రవాసాంధ్ర ప్రజా నాట్య మండలి అధ్యక్షుడు రుద్రమూర్తి అన్నారు. బిలాయిలో ఆదివారం ప్రవాసాంధ్రుల ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో శ్రీ శ్రీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రపంచంలో అణచివేత ఉన్నంత కాలం ప్రజా ఉద్యమాలు కొనసాగుతూనే ఉంటాయని, ఈ ఉద్యమాలు ఉన్నంత వరకు శ్రీశ్రీ సజీవంగానే ఉంటారని అన్నారు. కార్యక్రమంలో రంగస్థల నటులు, రచయితలు, సంఘం సభ్యులు ఎస్.నారాయణ స్వామి, చీకటి గణపతిరావు, కృష్ణమూర్తి దివానా, ఎం.ధర్మారావు, ఎల్.చైతన్య ఉన్నారు.

రోటరీ క్లబ్ సేవలు వెలకట్టలేనివి


సామాజిక ఆస్పత్రికి వాటర్ ఫిల్టర్ అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు


మొక్కలు నాటుతున్న రోటరీ గవర్నర్ దత్తా తదితరులు

• డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు

సోంపేట: సోంపేట రోటరీ క్లబ్ ద్వారా అందిస్తున్న సామాజిక సేవలు వెలకట్టలేనివని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు (దత్తా) అన్నారు. సోంపేట పరిసర ప్రాంతాల్లో ఆదివారం పలుసేవా కార్యక్రమాలు రోటరీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సోంపేట పట్టణంలో రూ. 25 లక్షలతో నిర్మించిన సులాబ్‌కాంప్లెక్స్‌ను, రోటరీ వాటర్ ప్రాజెక్టును ప్రారంభించారు. రోటరీ వీధిలో సిమెంట్ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. సోంపేట సామాజిక ఆస్పత్రిలోని రోగులకు పౌష్టికాహారం, ఆస్పత్రికి కుర్చీలు, వాటర్ ఫిల్టర్ అందజేశారు. జింకిభద్రలోని యర్రవాని చెరువు గట్టుపై మొక్కలు నాటారు. కొర్లాం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు పౌష్టికాహారం, ఆస్పత్రికి కుర్చీలు, బారువ ప్రాథమిక పాఠశాలకు కంప్యూటర్, బారువలోని చిలుకూరి గోశాలలోని పశువులకు దాణా అందజేశారు.

మెరుగైన సేవలు

సోంపేట రోటరీ క్లబ్ సేవలు అందుతున్నాయని రోటరీ జిల్లా గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు అన్నారు. సోంపేట రోటరీక్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోంపేట రోటరీ ఆధ్వర్యంలో అందజేస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. సోంపేటలో ఏర్పాటు చేసిన సులాబ్ కాంప్లెక్స్ ప్రయాణికులకు ఉపయోగపడుతుందన్నారు. సోంపేట శ్మశాన వాటికలో మృతదేహాలను గ్యాస్‌తో దహన పరిచేందుకు రూ.10 లక్షల విలువగల పరికరాన్ని అందజేయనున్నట్టు ప్రకటించారు. సోంపేట రోటరీ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అందరి సహకారంతో సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి రవికుమార్, కార్యదర్శి పి.వి. కృష్ణారావు ఉన్నారు.

బాధితుడికి అండగా..


సాయం అందజేస్తున్న సభ్యులు

కాశీబుగ్గ: పలాస మండలం టెక్కలిపట్నం పంచాయతీకి చెందిన యువకుడు ఎస్.శంకరరావు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కైలాసవాస చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అండగా నిలిచారు. పది వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని కాశీబుగ్గలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న శంకరరావుకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త పాలవలస రామక్రిష్ణశర్మ, సభ్యులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం 132/33 కేవీ ఫీడర్‌లో సోమవారం మరమ్మతులు చేపట్టనున్నారు. దీంతో ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, ఇచ్ఛాపురం మండలం, కవిటి మండలం పరిధిలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు పలాస డివిజన్ ఈఈ జి.ప్రసాదరావు, స్థానిక ఏఈ గోవిందరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేత

గార: ఇటీవల విడుదలైన పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో మండలస్థాయిలో ప్రతిభ చూపిన పలువురు విద్యార్థులకు బీవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహక బహుమతులను ఆదివారం అందజేశారు. శ్రీకూర్మం జంక్షన్‌లోని కల్యాణ మంటపంలో ఫాదర్స్ డే సందర్భంగా బీవీఆర్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి తొమ్మిది మందికి నగదుతో పాటు పతకాలను అందజేశారు.

ఆటో సంబరాలకు సన్నద్ధం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఏటా యూనియన్ ఆధ్వర్యంలో ఆటో సంబరాలను డ్రైవర్లు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది కూడా సంబరాల నిర్వహణకు యూనియన్ ప్రతినిధులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా సంబరాల్లో పాల్గొనాలని కోరుతూ ప్రముఖులకు ప్రముఖులకు యూనియన్ సభ్యులు ఆహ్వాన పత్రాలను అందజేస్తున్నారు. ఆటో యూనియన్ సంఘ గౌరవ అధ్యక్షులుగా ఉన్న పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్‌ను సభ్యులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఏడాదికి ఒక్కసారి జరిపే చల్లదనం కార్యక్రమాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో జరగనున్న సంబరాల్లో భాగంగా పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి తర్లాకోట కాటమ్మతల్లి ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. త్వరలోనే సంబరాలు జరిగే తేదీని ప్రకటిస్తామన్నారు.


శ్రీధర్‌తో చర్చిస్తున్న యూనియన్ సభ్యులు

అనాథల సేవలో పునీతం


పునరావాస కేంద్ర భవనాన్ని ప్రారంభిస్తున్న అతిథులు


దివ్యాంగుల సేవకోసం ఏర్పాటు చేసిన వాహనాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

కంచిలి: సీతయ్య ఫౌండేషన్ సంస్థ ఐదేళ్లుగా అనాథలు, అభాగ్యులు, దివ్యాంగుల సేవలో పునీతమైందని వక్తలు కొనియాడారు. సీతయ్య ఫౌండేషన్ ఏర్పడి ఐదేళ్ల పూర్తయిన సందర్భంగా ఏర్పాటు మరిన్ని సేవా కార్యక్రమాలను ఆదివారం ప్రారంభించారు. ఇందులో దివ్యాంగుల చిన్నారుల పునరావాస కేంద్రాన్ని అవయవదాత మల్లారెడ్డి కిరణ్ చంద్ స్ఫూర్తితోను, దివ్యాంగుల సేవల కోసం ఏర్పాటు చేసిన నూతన వాహనం ప్రారంభోత్సవం, మంచినీటి ప్రాజెక్టు, అతిథి భవనాలను ఈ సందర్భంగా ప్రారంభించారు. సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుళ్ల రమేష్, మోహన్‌ల ఆధ్వర్యంలో ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాలన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాలకు హైదరాబాద్‌కు చెందిన అరుంధతి సేవట్రస్ట్ చైర్మన్ భూక్య బాలు, మిస్ గ్లోబల్ వరల్డ్ ఇండియా 2024 అనుశ్రీరెడ్డి, పంజాల శ్రావణ్‌గౌడ్, పల్సర్ బైక్ సింగర్ రమణ, కొరియోగ్రాఫర్ బాలు, డాన్సర్ నితిన్‌నాయక్, స్థానిక ప్రముఖులు విచ్చేశారు.

ఘనంగా ఫాదర్స్‌డే వేడుకలు


వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: మున్సిపాలిటీ ఏడోవార్డు చినబాడం గ్రామంలోని క్రిస్టియన్ ప్రార్థన మందిరంలో ఆదివారం ఫాదర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘంలోని తల్లిదండ్రులను స్మరించుకున్నారు. సంఘ కాపరులైన బిషప్ డి.ఎస్.వి.ఎస్.కుమార్, సతీష్‌కుమార్, రాజు పాస్టర్‌లను సత్కరించారు.

ఉత్సవ సందడి

ఇచ్ఛాపురం రూరల్: తొలకరి వర్షాలు కురవాలని, ఈ ఏడాది పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని కోరుతూ ఆదివారం ఊరూర గ్రామదేవతలకు చల్లదనోత్సవ వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం లొద్దపుట్టి ధనరాజులమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. మేళతాళలతో అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు.


ధనరాజుల తులసమ్మను ఊరేగిస్తున్న భక్తులు


తిప్పనపుట్టుగలో కాళీమాత ఉత్సవం


ఉర్రూతలూగించిన కోయనృత్య ప్రదర్శన

ఎమ్మెల్యేను కలిసిన కిడ్నీ ఆస్పత్రి వైద్యులు


ఎమ్మెల్యేను అభినందిస్తున్న వైద్య సిబ్బంది

కాశీబుగ్గ: పలాస ఎమ్మెల్యేగా ఎంపికైన గౌతు శిరీషాను పలాసలోని డాక్టర్ వైఎస్సార్ కిడ్నీ పరిశోధన కేంద్రం, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ యూనిట్ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ఆస్పత్రి విధి విధానాలు, అందుతున్న సేవల గురించి సిబ్బందిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కిడ్నీ పరిశోధన కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మ, సీఆర్ఎస్ఎం డాక్టర్ కూన మోహనబాబు తదితరులున్నారు.

అరుంధతిరాయ్‌పై పెట్టిన కేసును రద్దు చేయాలి


మాట్లాడుతున్న మాధవరావు

పలాస: ప్రముఖ రచయిత్రి అరుంధతిరాయ్‌పై ప్రభుత్వం పెట్టిన ఉపా చట్టం కేసును ఉపసంహరించుకోవాలని, ప్రజల వాక్ స్వాతంత్ర్యాన్ని కాపాడాలని సీపీఐ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వి.మాధవరావు కోరారు. పలాసలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. 14 ఏళ్ల నాటి కేసులను ఈ విధంగా తిరగదోడటం చట్ట విరుద్ధమన్నారు. ప్రజా హక్కుల కోసం గొంతెత్తే వారిని ఈ విధంగా కేసుల్లో ఇరికించడం అప్రజాస్వామికమన్నారు. తక్షణమే ఈ కేసును ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనరు జుత్తు వీరాస్వామి, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు ఎం.వినోద్ ఉన్నారు.